క్లుప్తంగా

వైద్యులను సంప్రదించి మందులు వాడాలి



అవగాహన కల్పిస్తున్న అధికారులు

జమ్మికుంట: వావిలాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పాపక్కపల్లి గ్రామంలో డాక్టర్ రాజేశ్‌కుమార్ ఆధ్వర్యంలో యాంటీ మైక్రోబయల్ వాడకంపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెల్త్ ఎడ్యుకేటర్ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. యాంటీబయాటిక్స్ అతిగా వాడితే అనర్థాలు చోటుచేసుకుంటాయన్నారు. వైద్య నిపుణులను సంప్రదించి మందులు వాడాలని సూచించారు. కార్యదర్శి నరేందర్‌రెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ సదానందం, రమ, ఏఎన్‌ఎం లక్ష్మి, ఆశ కార్యకర్త పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ధ్యేయం



తూకం పరిశీలిస్తున్న రాజమల్లయ్య

రామడుగు: రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తుందని టీపీసీసీ ఎస్సీ డిపార్టుమెంట్ రాష్ట్ర వైస్ చైర్మన్ వెన్న రాజమల్లయ్య అన్నారు. వెదిర గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం పరిశీలించారు. కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చిన ప్రతీ గింజను కొనుగోలు చేయడంతోపాటు బోనస్ కూడా అందిస్తారని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి



తహసీల్దార్ రాణి

ఇల్లందకుంట: మండలంలో 18 సంవత్సరాలు నిండిన యువత ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ రాణి శుక్రవారం ఒక ప్రకటనలో సూచించారు. మార్పులు, చేర్పులు, తొలగింపుల సవరణకు ఈనెల 23, 24ల్లో గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల వద్ద బీఎల్‌వోలు అందుబాటులో ఉంటారని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

శతాధిక వృద్ధురాలు మృతి



లస్మవ్వ(ఫైల్)

గంగాధర: కొండన్నపల్లి గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు విలాసాగరం లస్మవ్వ(110) శుక్రవారం మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు. లస్మవ్వ తన పని తానే చేసుకునేదన్నారు. ఆమెకు కుమారుడు, ముగ్గురు కూతుళ్లున్నారు.

గీత కార్మికుడికి తీవ్ర గాయాలు

వీణవంక: రెడ్డిపల్లి గ్రామానికి చెందిన మంజాల మల్లయ్య అనే గీత కార్మికుడు తాటిచెట్టుపై నుంచి జారి పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. గ్రామస్తుల వివరాల ప్రకారం.. వృత్తిలో భాగంగా శుక్రవారం ఉదయం సమీపంలోని తాటి వనానికి వెళ్లి తాటి కల్లు గీస్తుండగా.. ప్రమాదవశాత్తు జారి పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు 108కి సమాచారమివ్వగా.. జమ్మికుంటలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

దర్గా దర్శించడం సరికాదు

హుజూరాబాద్: అయ్యప్ప మాల ధరించి సినీ నటుడు రామ్‌చరణ్ దర్గాను దర్శించడం సరికాదని బీజేపీ పట్టణ అధ్యక్షుడు రాజు ఖండించారు. దీక్ష నియమం ప్రకారం మాల వేసుకున్న స్వామి సొంత కుటుంబ సభ్యులు చనిపోయినా సమాధుల దగ్గరికి మాలధారణతో వెళ్లడం నిషేధమన్నారు.

రైతు సంక్షేమంపై పట్టింపేది?

సైదాపూర్: ప్రజాపాలనలో రైతు సంక్షేమంపై పట్టింపు కరువైందని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సోమారపు రాజయ్య ఆరోపించారు. శుక్రవారం మండల కేంద్రంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో రైతు సంక్షేమ పథకాలపై ఇచ్చిన హామీల ఊసెత్తడం లేదని అన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

శంకరపట్నం: విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిస కావద్దని హుజూరాబాద్ ఎక్సైజ్ సీఐ శ్రీనివాసులు సూచించారు. తాడికల్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మత్తు పదార్థాల అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎంఈవో లక్ష్మీనారాయణ, ఎస్సై వినోద్‌కుమార్, హెడ్ కానిస్టేబుల్ ముకుందరెడ్డి ఉన్నారు.

ప్రభుత్వ భూమి పేదలకివ్వాలి

శంకరపట్నం: ప్రభుత్వ భూమి పేదలకందించాలని తహసీల్దార్ భాస్కర్‌కు ధర్మసమాజ్ పార్టీ నాయకులు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. జిల్లా అధ్యక్షుడు నరేశ్, మండల అధ్యక్షుడు ప్రశాంత్, రాజేంద్రప్రసాద్, బాబు, నర్సయ్య, నవీన్, సురేశ్, అనిల్ ఉన్నారు.



రైతుల కష్టార్జితం.. కోతులకు ఆహారం

మానకొండూర్ రూరల్: రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన వరి ధాన్యాన్ని మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌లో ఆరబోశారు. కొనుగోలు కేంద్రంలో చుట్టూ ఉన్న గోడను దాటి కోతులు స్వైర విహారం చేస్తున్నాయి. ఆరబోసిన ధాన్యాన్ని కోతులు చెల్లాచెదురు చేయడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. దోమపోటు, అకాల వర్షంతో నష్టపోయామని, కోతుల బెడదతో మరింత ఆర్థిక నష్టానికి గురౌతున్నామని వాపోతున్నారు. సంబంధిత మార్కెట్ సిబ్బంది, అధికారులు చర్యలు తీసుకొని కోతుల బెడదను నివారించాలని కోరుతున్నారు.

విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం

రామడుగు: వెంకట్రావుపల్లి గ్రామంలో నూతనంగా నిర్మాణం చేసిన శ్రీసీతా రామచంద్రస్వామివారి దేవస్థానంలో విగ్రహ స్థిర ప్రతిష్ఠ మహోత్సవం ఘనంగా నిర్వహిస్తున్నారు. వేద పండితులు గుండి రాజేశ్వర్‌శర్మ, మధుశంకర్‌శర్మ, ఆదిత్యశర్మ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం నిత్య పూజ, మూలమంత్ర హవనం, సామూహిక లక్ష్మీనారాయణ హవనం, ధాన్య, ఫల, పుష్ప, శయ్యాధివాసాలు, రాజోపచారాలను వేదపండితుల ఆధ్వర్యంలో జరిపారు. శనివారం స్వామివారి యంత్ర ప్రతిష్ఠ, విగ్రహ ప్రతిష్ఠ, కళావాహన మహాపూర్ణాపూజ, ప్రథమ పూజ, సర్వదర్శనంతోపాటు సాయంత్రం శ్రీసీతారామచంద్రస్వామివారి కల్యాణం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



కలగానే 'వారధి'

- మల్లారెడ్డిపల్లి–కనగర్తి వంతెన నిర్మాణంపై అయోమయం
- ఇక్కడ నిర్మిస్తే మూడు జిల్లాలకు అనుసంధానం
- నిధులు మంజూరు చేయాలంటున్న ప్రజలు



మల్లారెడ్డిపల్లి మానేరు వాగు

వీణవంక: మల్లారెడ్డిపల్లి మానేరు వాగుపై వంతెన నిర్మించాలని కొంతకాలంగా వినతులు వెల్లువెత్తుతున్నాయి. ఈ వాగుపై వారధి నిర్మించకపోవడంతో వాహనదారులకు దూరాభారం తప్పడం లేదు. గతంలో ఈటల రాజేందర్ మంత్రిగా ఉన్న సమయంలో నిర్మాణానికి ప్రతిపాదనలు పంపారు. తర్వాత జరిగిన పరిణామాల నేపథ్యంలో ఆ కల నెరవేరలేదు. వాగుపై వంతెనలు నిర్మిస్తే పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాలకు రవాణా సులభతరం కానుంది. కరీంనగర్ ఎల్‌ఎండీ దిగువ నుంచి ప్రారంభమైన ఈ వాగు మానకొండూరు, వీణవంక మండలాలను కలుపుకొని ప్రవహిస్తోంది. మల్లారెడ్డిపల్లి వాగు అవతలి వైపు పెద్దపల్లి జిల్లా కనగర్తి గ్రామం ఉంది. ఇక్కడ వంతెన నిర్మిస్తే పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాలకు వెళ్లే ప్రజలకు దూరాభారం తగ్గనుంది. వాగులో నీళ్లు లేనప్పుడు ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లు, ట్రాక్టర్లు వాగు దాటి కనగర్తి వైపు వెళ్తుండేవి. ఇటీవల కురిసిన వర్షాలకు ఎల్‌ఎండీ గేట్లు ఎత్తడంతో వాగులో వరద రావడంతో రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

మూడు జిల్లాలకు ప్రయోజనం

వంతెన నిర్మిస్తే రవాణా భారం తగ్గుతుందని మల్లారెడ్డిపల్లి, కనగర్తి గ్రామస్తులు గతంలో మంత్రుల దృష్టికి తీసుకెళ్లారు. కానీ కార్యరూపం దాల్చలేదు. ఇదే వాగుపై జమ్మికుంట మండలం తనుగుల–ఓదెల మండలం గుంపుల గ్రామాల మధ్య రామభద్ర వంతెనను 20 ఏళ్ల క్రితం నిర్మించారు. సుల్తానాబాద్ మండలం నీరుకుల్ల వాగుపై కూడా మరో వంతెనను నిర్మించారు. హుస్నాబాద్, సైదాపూర్, చిగురుమామిడి, శంకరపట్నం, తిమ్మాపూర్ మండలాల ప్రజలు మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాలకు వెళ్లాలంటే ఈ రెండు వంతెనల మీదుగా దూరాభారం పెరగనుంది. అదే మల్లారెడ్డిపల్లి వాగు మీద నుంచే వెళ్తే 20 కిలోమీటర్ల దూరం తగ్గనుంది. ఉత్తర తెలంగాణలో జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ ప్రథమ స్థానంలో ఉంది. సుల్తానాబాద్, ఓదెల మండలాల ప్రజలు పత్తి, వరి ధాన్యం జమ్మికుంటలోనే విక్రయిస్తుంటారు. వంతెన నిర్మిస్తే మూడు జిల్లాల వ్యాపార అభివృద్ధితోపాటు రవాణా సౌకర్యం మరింత మెరుగుపడనుంది.

రూపునారాయణపేట వారధికి మోక్షం

ఓదెల మండలం రూపునారాయణపేట–జమ్మికుంట మండలం విలాసాగర్ గ్రామాల మధ్య ఉన్న వాగుపై వారధి నిర్మించేందుకు రూ.80కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఇందుకు పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణరావు విశేష కృషి చేశారు. పనులు కూడా త్వరలోనే జరగనున్నాయి. అయితే ఇక్కడ నిర్మాణం కంటే మల్లారెడ్డిపల్లి వాగు మీద నిర్మిస్తే మరింత దూరాభారం తగ్గుతుందని ప్రయాణికులంటున్నారు. ఇప్పటికైనా మంత్రులు, ఎమ్మెల్యేలు కలగజేసుకొని మల్లారెడ్డిపల్లి వాగుపై వంతెన నిర్మించేందుకు నిధులు మంజూరు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

వంతెన నిర్మించాలి

మల్లారెడ్డిపల్లి–కనగర్తి మధ్య వంతెన నిర్మిస్తే మూడు జిల్లాల వ్యాపార అభివృద్ధితోపాటు రవాణా సౌకర్యం మరింత మెరుగుపడుతుంది. పెద్దపల్లి జిల్లాకు వెళ్లాలంటే జమ్మికుంట మండలం తనుగుల వంతెన మీదుగా ప్రజలు వెళ్తున్నారు. దీంతో రవాణా భారం మీద పడుతోంది. మల్లారెడ్డిపల్లి వాగుపై నిర్మిస్తే ఈ ప్రాంత ప్రజలకు సులభతరమవుతుంది. వంతెన నిర్మించాలని గతంలో అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. కానీ సమస్య పెండింగ్‌లోనే ఉంది. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు కలగజేసుకొని వంతెన నిర్మించాలి.

– కర్రె నాని, గ్రామస్తుడు, మల్లారెడ్డిపల్లి

అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం సభ

మానకొండూర్: గంగిపల్లి గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం సభ నిర్వహించారు. పోషకాహారం, అంగన్వాడీ సేవలు, సాధారణ ప్రసవం, పరిసరాల పరిశుభ్రత, రక్తహీనత తదితర అంశాలపై పిల్లల తల్లులు, గర్భిణిలకు సీడీపీవో శ్రీమతి అవగాహన కల్పించారు. పిల్లలకు అక్షరాభ్యాసం చేశారు. సూపర్‌వైజర్ అరుణ, హెల్త్ సూపర్‌వైజర్ సరోజన, కార్యదర్శి కిరణ్‌కుమార్‌రెడ్డి, ఏఎన్‌ఎం యాద జయమణి, అంగన్వాడీ టీచర్లు శారద, ఉమ, రాజకుమారి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

మానకొండూర్(గన్నేరువరం): గన్నేరువవరం మండల కేంద్రంలోని అంగన్వాడీ 1, 2 సెంటర్లలో శుక్రవారం సభ నిర్వహించారు. మండల ప్రత్యేకాధికారి రామానుజాచారి మాట్లాడారు. పిల్లలకు అక్షరాభ్యాసం చేశారు. ఇస్రాత్, తల్లులు పాల్గొన్నారు.

ఇల్లందకుంట: పోషకాహార లోపం బారిన పడకుండా మహిళలను ఆరోగ్యవంతులుగా ఉంచడమే సభ ముఖ్య ఉద్దేశమని ఎంపీడీవో పుల్లయ్య అన్నారు. శుక్రవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో రాచపల్లి గ్రామంలోని అంగన్వాడీ కేంద్రం ఆవరణలో సభ ఏర్పాటు చేశారు. డాక్టర్ తులసిదాస్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోతి, మహిళలు పాల్గొన్నారు.

శంకరపట్నం: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం సభలు జరిగాయి. కాచాపూర్, చింతగుట్ట అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. మండల ప్రత్యేక అధికారి నాగార్జున, ఎంపీవో ప్రభాకర్, సూపర్‌వైజర్లు కవిత, స్రవంతి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.



అక్షరాభ్యాసం చేయిస్తున్న ఎంపీడీవో పుల్లయ్య

ప్రజాపాలన విజయోత్సవాల కళాయాత్ర

జమ్మికుంట: వావిలాల, గండ్రపల్లి, తనుగుల గ్రామాల్లో ప్రజాపాలన విజయోత్సవాల కార్యక్రమంలో భాగంగా తెలంగాణ సాంస్కృతిక సారథి వడ్లకొండ అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో కళాయాత్ర కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు పాటల రూపంలో వివరించారు. పూల్లూరి స్వప్నసదానందం, గ్రామ కమిటీ అధ్యక్షుడు వానరాశి జాను, కళాబృందం సభ్యులు మహాదేవుని శ్రీధర్, అవునూరి కోమల, ఎర్ర సురేశ్, ఎండీ నిజామొద్దీన్, రావుల తిరుపతి, రావుల సాయికుమార్, కొంకట తిరుపతి, ఎండీ ఆసియా, పోతరవేణి పద్మ తదితరులు పాల్గొన్నారు.



పాల్గొన్న సాంస్కృతిక సారథి బృందం

రాజ్యాంగ పరిరక్షణ యాత్ర కరపత్రం విడుదల

సైదాపూర్: రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉండి రాజ్యాంగాన్ని మారుస్తామనే కొందరు మనువాదుల నుంచి భారత రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాల్సిన అవసరముందని తెలంగాణ అంబేడ్కర్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెప్యాల ప్రకాశ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో భారత రాజ్యాంగ పరిరక్షణ యాత్ర కరపత్రం విడుదల చేశారు. నవంబర్ 26న భారత రాజ్యాంగం 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా రాజ్యాంగ దినోత్సవం ఘనంగా జరుపుకుందామన్నారు. హుస్నాబాద్ పట్టణంలో అంబేడ్కర్ చౌరస్తా వద్ద ముగింపు సభకు అన్ని మండలాల నుంచి నాయకులు తరలిరావాలని కోరారు. మాజీ ఎంపీటీసీ మిట్టపెల్లి కిష్టయ్య, మాజీ సర్పంచ్ నమిండ్ల రవీందర్, రాష్ట్ర నాయకులు ఎల్లన్న బహుజన్, సుధాకర్, రమేశ్, రాహుల్, సందీప్ ఉన్నారు.

సన్న రకం ధాన్యం కొనుగోళ్లు

శంకరపట్నం: మండలంలోని ధాన్యం కొనుగోళ్ల కేంద్రాల్లో 90,683 క్వింటాళ్ల సన్న రకం ధాన్యం కొనుగోళ్లు చేశారు. ఈనెల 21 వరకు మెట్‌పల్లి సింగిల్‌విండోలో 52,523 క్వింటాళ్లు సన్న రకం ధాన్యం, తాడికల్‌లో 21,500, గద్దపాకలో 16,840 క్వింటాళ్ల సన్న ధాన్యం కొనుగోళ్లు చేయగా.. మెట్‌పల్లిలో 3,340 క్వింటాళ్ల దొడ్డు రకం ధాన్యం కొనుగోళ్లు చేసినట్లు సీఈవో సదయ్య తెలిపారు. రెండు రోజులుగా రైతుల ఖాతాలో సన్న రకం ధాన్యం బోనస్, ధాన్యం డబ్బులు జమ చేస్తున్నారు.

నియామకం

కార్యవర్గం ఎన్నిక

మానకొండూర్: గన్నేరువరం మండల గౌడ సంఘం నూతన కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బుర్ర తిరుపతిగౌడ్(గన్నేరువరం), ఉపాధ్యక్షులుగా న్యాలపట్ల రవిగౌడ్(గునుకులకొండాపూర్), బట్టు మునిరాజ్‌గౌడ్(గుండ్లపల్లి), ప్రధాన కార్యదర్శిగా బుర్ర కనకయ్యగౌడ్(జంగపల్లి), కోశాధికారిగా బుర్ర రాజ్‌కోటిగౌడ్(గన్నేరువరం), వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బుర్ర శ్రీధర్‌గౌడ్(గన్నేరువరం) సహాయ కార్యదర్శిగా బొమ్మ సదశివగౌడ్(మైలారం), పొన్నం శ్రీనివాస్‌గౌడ్(మాదాపూర్), ముఖ్య సలహాదారుగా అట్టికం శ్రీనివాస్‌గౌడ్(జంగపల్లి), బుర్ర లక్ష్మీరాజంగౌడ్(గన్నేరువరం), సభ్యులు ఎన్నికయ్యారు.

నాయీబ్రాహ్మణ సంఘం..

కరీంనగర్: తెలంగాణ నాయీబ్రాహ్మణ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు మొండయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి జంపాల సంపత్ ఆధ్వర్యంలో నాయీబ్రాహ్మణ యువజన సంఘం జిల్లా కన్వీనర్, కో కన్వీనర్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నాయీబ్రాహ్మణ యువజన సంఘం జిల్లా కన్వీనర్‌గా సమ్మెట శ్రీనివాస్, కో కన్వీనర్‌గా ఓరుగంటి వేణులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలోని 16 మండలాల యువతను ఏకం చేస్తూ సంఘ అభివృద్ధితో పాటు జిల్లా, నగర నాయీబ్రాహ్మణ కల్యాణ మండప నిర్మాణానికి కృషి చేస్తామని అన్నారు.

బీసీల సమరభేరిని విజయవంతం చేయాలి

హుజూరాబాద్: ఈనెల 25న హైదరాబాద్ రవీంద్రభారతిలో జరిగే బీసీల సమరభేరిని విజయవంతం చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి ఐలేశ్‌యాదవ్ పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు.

వికలాంగుల బైక్ ప్రారంభం



బైక్ ప్రారంభిస్తున్న నాయకులు

జమ్మికుంట: పట్టణంలోని కొత్తపల్లిలో ఎండీడబ్ల్యూ ఈవీ కంపెనీకి చెందిన జేఎస్ బైక్ షోరూంలో నూతనంగా వికలాంగులకు ప్రత్యేక డిజైన్‌తో తయారైన బైక్‌ను మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పుల్లూరి స్వప్నసదానందం, ఎస్సీ డిపార్టుమెంట్ ఆఫ్ అట్రాసిటీజెన్ రాష్ట్ర కన్వీనర్ తిప్పారపు సంపత్ శుక్రవారం ప్రారంభించారు. షోరూం యజమాని జాన్ శంకర్, పట్టణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు పూదరి రేణుకశివకుమార్‌గౌడ్, డైరెక్టర్లు ఎండీ శ్రీకాంత్, రాజ్‌కుమార్, పాస్టర్ యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.

ఒకే గ్రామానికి చెందిన ఐదుగురికి ఉద్యోగాలు

ఇల్లందకుంట: లక్ష్మాజిపల్లె గ్రామానికి చెందిన ఐదుగురు పోలీస్ కానిస్టేబుళ్లుగా ఉద్యోగం సాధించారు. నల్ల అమరేందర్‌రెడ్డి, ఓదారపు రవి, బండి వినయ్, కోడూరి అర్జున్ సివిల్ కానిస్టేబుళ్లుగా ఉద్యోగం సాధించారు. కోడూరి శ్రీనివాస్ ఏఆర్ కానిస్టేబుల్‌గా విజయం సాధించారు. వారు మాట్లాడుతూ.. గతంలో విఫలమై మళ్లీ కష్టపడి విజయం సాధించామన్నారు.





హుజూరాబాద్: సిర్సపల్లి గ్రామంలోని ప్రధాన రహదారి పక్కన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉంది. వాహనదారులు భయంభయంగానే రాకపోకలు సాగిస్తున్నారు. అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
జనార్దన్, రూరల్ ఏఈ, సెల్ నం.: 9440811452

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227

కబడ్డీ పోటీలకు ఎంపిక



తరుణ

చిగురుమామిడి: మండల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సీఈసీ మొదటి సంవత్సరం చదువుతున్న ఎ.తరుణ అనే విద్యార్థిని రాష్ట్రస్థాయి అండర్–19 కబడ్డీ పోటీలకు ఎంపికై ంది. శుక్రవారం కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఇల్లందుల సంపత్ మాట్లాడుతూ.. గత నెల 23న కరీంనగర్‌లో జిల్లాస్థాయి బాలికల కబడ్డీ పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబర్చినట్లు చెప్పారు. ఈనెల 23న రంగారెడ్డి జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికై ందన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా జట్టు తరఫున ఆడుతుందని అన్నారు. తరుణది పీచుపల్లి గ్రామం.

క్రీడా పోటీల్లో ప్రతిభ



విద్యార్థినిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

హుజూరాబాద్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీకాం తృతీయ సంవత్సరం చదువుతున్న నల్లగొండ రష్మిత అనే విద్యార్థి ఇంటర్ యూనివర్సిటీ క్రాస్ కంట్రీ చాంపియన్‌షిప్ పోటీల్లో ఎస్‌యూ తరఫున పాల్గొని విజయం సాధించింది. మంగళూర్ యూనివర్సిటీలో జరిగే పోటీల్లో శాతవాహన యూనివర్సిటీ తరఫున ప్రాతినిధ్యం వహించి విజయం సాధించినందుకు గాను శుక్రవారం కళాశాల ప్రిన్సిపాల్ ఇందిరాదేవి, అధ్యాపకులు అభినందించారు. శాలువాతో సత్కరించి మెమొంటోను అందజేశారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ మల్లారెడ్డి, అకాడమిక్ సమన్వయకర్త లింగారెడ్డి తదితరులున్నారు.

చొప్పదండి: ఈనెల 23 నుంచి వరంగల్ జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ నెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లా జట్టు తరఫున చొప్పదండిలోని జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు బి.అరవింద్, కె.యశ్వంత్, బి.వైష్ణవి, కె.అంజలి ఎంపికయ్యారు. రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అసోషియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 23 నుంచి మెదక్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ సబ్ జూనియర్స్ అండర్ 15 చాంపియన్‌షిప్‌లో జిల్లా జట్టు తరఫున ఇదే పాఠశాలకు చెందిన జి.రామ్‌చరణ్, జి.కుశాల్‌సాయి ఎంపికయ్యారని పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ కొమురోజు కృష్ణ తెలిపారు.

ఖేల్

చొప్పదండి: భారత మినిస్ట్రీ ఆఫ్ జల్‌శక్తి, పారిశుద్ధ్య శాఖ ఆన్‌లైన్ వేదికగా దేశవ్యాప్తంగా నిర్వహించిన స్వచ్ఛభారత్ గ్రామీణ్ ఫేజ్–2 క్విజ్ పోటీల్లో రెవెళ్లి ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. విద్యార్థులకు మండల విద్యాధికారి దీక్షితులు శ్రీనివాస్ డిజిటల్ పార్టిసిపేషన్ సర్టిఫికెట్లను శుక్రవారం అందించారు.

మానకొండూర్: ఈనెల 11 నుంచి 14 వరకు దేవంపల్లిలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో జరిగిన గురుకులాల టెన్త్ జోనల్ స్పోర్ట్స్ మీట్‌లో గెలుపొందిన దేవంపల్లి విద్యార్థులను గురువారం ఉదయం ప్రిన్సిపాల్ గోలి జగన్నాథం అభినందించారు. విద్యార్థులకు కప్, మెమొంటో, పతకాలు అందజేశారు. సీనియర్ వైస్ ప్రిన్సిపాల్ కొమురయ్య, జూనియర్ వైస్ ప్రిన్సిపాల్ రబియా, సీనియర్ టీచర్ స్రావ్య, టీచర్లు చారి, ఆంజనేయులు, బాబు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపిక



విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఇల్లందకుంట: మహబూబాబాద్ జిల్లా కల్వచర్లలో ఈనెల 23 నుంచి 25 వరకు జరిగే రాష్ట్రస్థాయి అండర్ 17 బాలబాలికల నెట్‌బాల్ పోటీలకు సిరిసేడు ఉన్నత పాఠశాల విద్యార్థి ఆలేటి రాము(9వతరగతి) ఎంపికైనట్లు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ బి.సత్యనారాయణ తెలిపారు. ప్రధానోపాధ్యాయుడు బి.జగదీశ్వర్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ రమ, ఉపాధ్యాయుడు ప్రభాకర్‌రెడ్డి, విద్యార్థులు అభినందించారు.

పాఠశాల సందర్శన

శంకరపట్నం: కొత్తగట్టు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలను శుక్రవారం డీఈవో జనార్దన్‌రావు సందర్శించారు. విద్యార్థులు యూనిఫాం వేసుకోవాలని సూచించారు. అకాడమిక్ మానిటరింగ్ అధికారి అశోక్‌రెడ్డి, హెచ్‌ఎం శ్రీలత, ఉపాధ్యాయులున్నారు.

వైద్యుల బోర్డులు ప్రదర్శించాలి



రికార్డులు పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ చందు

హుజూరాబాద్: పట్టణంలోని పలు ప్రైవేట్ ఆసుపత్రులను శుక్రవారం డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ చందు తనిఖీ చేశారు. మెడికల్ షాప్ రిజిస్ట్రేషన్ పత్రాలు పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చే వైద్యుల పేర్లుండే బోర్డులు మాత్రమే ప్రదర్శించాలని, లేకుంటే కేసులు నమోదౌతాయన్నారు. హెల్త్ ఎడ్యుకేటర్ పంజాల ప్రతాప్, సిబ్బంది ఉన్నారు.

హాస్టళ్ల తనిఖీ

మానకొండూర్: మండల కేంద్రంలోని సమీకృత హాస్టల్‌తోపాటు శ్రీనివాస్‌నగర్‌లోని కస్తూర్బాగాంధీ, మోడల్ స్కూల్ హాస్టల్‌ను జిల్లా ట్రెయినీ కలెక్టర్ అజయ్‌యాదవ్ శుక్రవారం తనిఖీ చేశారు. హాస్టల్ పరిసరాలను పరిశీలించారు. ఎంపీడీవో వరలక్ష్మి, ఎంపీవో కిరణ్, మండల విద్యాధికారి మధుసుదనాచారి ఉన్నారు.

రికార్డుల పరిశీలన

వీణవంక: చల్లూరు, వీణవంక పీహెచ్‌సీలను జిల్లా వైద్యాధికారి వెంకటరమణ శుక్రవారం తనిఖీ చేశారు. రికార్డులు, మందులు, ఓపీని పరిశీలించారు. సిబ్బంది ఎందరున్నారో తెలుసుకున్నారు. సాధారణ ప్రసవాల సంఖ్య పెంచాలన్నారు.

తండ్రిపై తనయుడి దాడి

శంకరపట్నం: అర్కండ్ల గ్రామంలో తండ్రిపై తనయుడు దాడి చేశాడు. అర్కండ్ల గ్రామానికి చెందిన చిగురు కనకయ్య–కనకలక్ష్మి దంపతులకు ఇద్దరు కొడుకులు, నలుగురు కూతుళ్లున్నారు. ఇద్దరు కొడుకులకు వ్యవసాయ భూములివ్వగా.. పోషణ కోసం కనకయ్య మూడెకరాల భూమి ఉంచుకున్నాడు. ఈ భూమి కోసం తండ్రి కనకయ్యపై కొడుకు మహేశ్ గురువారం దాడి చేయడంతో తీవ్ర గాయాలు కాగా.. కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. కేశవపట్నం ఎస్సై రవిని వివరణ కోరగా.. సమాచారమిచ్చారని, విచారణ చేస్తామన్నారు.